23న స్పాట్ కౌన్సెలింగ్

జైపూర్: గురుకులాల్లో సీట్ల భర్తీకి ఈ నెల 23న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా సమన్వయ అధికారి, జైపూర్ ప్రిన్సిపాల్ కే.నాగేశ్వర్‌రావు తెలిపారు. బెల్లంపల్లి సీఓఈ బాలుర కళాశాలలో, బాలికల గురుకుల కళాశాలలో ఉదయం 9గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని, పదో తరగతి ఉత్తీర్ణులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జైపూర్‌లో 10, మంచిర్యాలలో 24, కాసిపేటలో 52, చెన్నూర్‌లో 30, మందమర్రిలో 7, లక్సెట్టిపేటలో 19, బెల్లంపల్లిలో 35సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు.

సింగరేణి క్రీడా షెడ్యూల్ విడుదల

శ్రీరాంపూర్: సింగరేణి కంపెనీ 2024–25 వార్షిక క్రీడా క్యాలెండర్‌ను బుధవారం విడుదల చేసింది. ఏరియాల వారీగా, కంపెనీ స్థాయిలో క్రీడల నిర్వహణ, దుస్తులు, సామగ్రికి రూ.1.46కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఏరియా స్థాయి క్రీడాపోటీలు నిర్వహించిన తర్వాత గెలిచిన జట్లతో కంపెనీ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 17 నుంచి డిసెంబర్ 19 వరకు కంపెనీ స్థాయి పోటీలు జరుగనున్నాయి. ప్రతిభ కనబరిచిన వారిని కోలిండియా పోటీలకు ఎంపిక చేస్తారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ప్రజలకు ఇబ్బంది లేకుండా భూసేకరణ

- ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్

మంచిర్యాలఅగ్రికల్చర్: నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన జాతీయ రహదారి–163(గ్రీన్‌ఫీల్డ్)కి సంబంధించి భూసేకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారి–163కు సంబంధించి భూసేకరణలో భాగంగా రహదారి నిర్మించే జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, అధికారులతో భూసేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో 110.6హెక్టార్లకు గాను 83.05హెక్టార్ల భూమి అప్పగించారని, ఇంకా 27.59హెకార్ల భూమి సేకరించాల్సి ఉందని తెలిపారు. 12.81 హెక్టార్ల భూమికి పరిహారం చెల్లించగా.. అధిక పరిహారం కోసం తిరిగి ఇచ్చారని, 5.33 హెక్టార్ల భూమి రాశి పోర్టల్ నమోదు చేయాల్సి ఉందని, ప్రక్రియ పూర్తయిన వెంటనే పరిహారం అవార్డు అందిస్తామని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో రహదారి నిర్మాణానికి అవసరమైన భూ సేకరణలో ప్రభుత్వ విధి విధానాలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియ పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల ఆర్డీవో రాములు, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు సంతోష్ పాల్గొన్నారు.

పంచాయతీ ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీల్లో ఓటరు జాబితా తయారీకి రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సెప్టెంబర్ 6న అన్ని రాజకీయ పార్టీల రాజకీయ ప్రతినిధులతో సమావేశం, 9న జిల్లా ఎన్నికల అధికారుల సమావేశం, 10న ఎంపీడీవో, ఎంపీవో, కార్యదర్శులతో మండల స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తారు. సెప్టెంబర్ 13వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. 19న డీపీవోల ద్వారా అభ్యంతరాల పరిశీలన, తొలగింపు అనంతరం 21న పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటరు జాబితా ప్రదర్శిస్తారు. ఈ ప్రక్రియ విజయవంతానికి ఈ నెల 29న ఓటరు జాబితాపై కలెక్టర్‌తో ఎన్నికల సంఘం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనుంది.

డీజీపీని కలిసిన డీసీపీ భాస్కర్




డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీపీ

మంచిర్యాలక్రైం: మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ బుధవారం రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. భాస్కర్‌కు ఈ నెల 14న యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (కేంద్ర మంత్రిత్వ శాఖ) ఐపీఎస్ హోదా కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐపీఎస్ హోదాలో డీజీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

జిల్లాలో ఏడీఏల బదిలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: వ్యవసాయ అధికా రుల బదిలీల్లో భాగంగా ఇప్పటికే ఏఈవోలు, ఏవోలు బదిలీలు కాగా బుధవారం జిల్లాలో ముగ్గురు వ్యవసాయ డివిజన్ అధికారులు(ఏడీఏలు) బదిలీ అయ్యారు. బెల్లంపల్లి డివిజన్ ఏడీఏ సురేఖ భీమిని డివిజన్‌కు, భీమిని డివిజన్ ఏడీఏ ఇంతియాజ్ హైదరాబాద్ వ్యవసాయ కమిషనరేట్‌కు, మహబుబాబాద్ జిల్లాకు చెందిన ఏడీఏ రాజు బెల్లంపల్లి డివిజన్‌కు, చెన్నూర్ ఇంచార్జి ఏడీఏగా ఉన్న రాజేశం స్థానంలో ఆదిలాబాద్ ఏడీఏ ప్రసాద్‌ను కేటాయించారు.

బంద్ విజయవంతం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

మంచిర్యాలక్రైం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రం మంచిర్యాలలో బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతమైంది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి ఆర్టీసీ డిపో గేటు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు జూపాక సుధీర్, పొట్ట మధూకర్, పాల్తేపు శంకరయ్య, నక్క శ్రీనివాస్, సోగాల కిష్టయ్య, మండల రవికుమార్, దేవరపల్లి మధుబాబు, గజల్ రాయమల్లు, పొళ్ల శ్రీనివాస్, నాగమల్ల ప్రకాష్, ఆసాది ప్రవీణ్, నారమళ్ల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పచ్చగా ప్రాంగణాలు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మందమర్రి మండలం కోటేశ్వరరావు పల్లె వాసుల కోసం ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం. నామమాత్రంగా ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. వానా కాలంలో మొక్కలు మొలిచి మైదానం పచ్చగా మారింది. ఈ క్రీడాప్రాంగణంలో ఎలాంటి ఆటలు ఆడే పరిస్థితి లేదు. దీని పక్కనే ఉన్న బొక్కలగుట్ట క్రీడా ప్రాంగణం పరిస్థితీ అంతే. పచ్చని గడ్డితో మైదానమంతా నిండిపోయి ఉంది. ఇలా జిల్లాలో అన్ని చోట్ల క్రీడాప్రాంగణాల నిర్వహణ గాలికి వది లేయడంతో ఔత్సాహిక క్రీడాకారులకు ఉపయోగపడకుండా పోతున్నాయి.



బెల్లంపల్లి మండలం దుగ్నేపల్లి పరిధిలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

- గడ్డి పెరిగి అధ్వానంగా క్రీడా మైదానాలు
- నిర్వహణ లేక నిరుపయోగం
- రూ.కోట్లు ఖర్చు చేసినా దక్కని ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో గ్రామీణ ప్రాంత వాసులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు, భవిష్యత్‌లో ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగేందుకు ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో 16 గ్రామీణ మండలాల పరిధిలో 311 పంచాయతీల్లో మొత్తం 548 క్రీడా ప్రాంగణాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. కానీ చాలాచోట్ల స్థలం కొరతతో గ్రామానికి దూరంగా, చెరువులు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలల్లో నిర్మించారు. గత ఏడాదే దాదాపు అన్నీ పూర్తయ్యాయి. కొన్ని చోట్ల పనులు అసంపూర్తిగా ఉండగానే వినియోగంలోకి తీసుకొచ్చారు. అందుబాటులోకి వచ్చినప్పటి నుంచే గ్రామీణ ప్రాంత ఔత్సాహిక క్రీడాకారుల కోసం ఎప్పటికప్పుడు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఇప్పటికీ ఏ ఒక్క చోట పూర్తి స్థాయిలో ఆటలు ఆడుకునేందుకు వీలుగా అందుబాటులోకి రాలేదు. దీంతో చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. మైదానాల్లో పశువులు, మూగజీవాలు సంచరిస్తున్నాయి. వానాకాలంలో మొక్కలు ఏపుగా పెరిగాయి. కొన్ని చోట్ల వరద నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి.

నిర్వహణ లేదు.. ఆటల్లేవు..

గ్రామ పంచాయతీల్లో నిధుల కటకటతో పంచాయతీల్లో పాలన పడకేసింది. కనీస నిర్వహణకు ఇబ్బందులు ఉన్నాయి. క్రీడా ప్రాంగణాలను పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో క్రీడా ప్రాంగణాల నిర్వహణను ఆయా పాలకవర్గాలు ఎప్పుడో మర్చిపోయాయి. గ్రామీణ ప్రాంత వాసుల కోసం ఏర్పాటు చేసిన మైదానాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. వాస్తవానికి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టు, లాంగ్‌జంప్, పార్‌లాల్, సింగిల్ ఎక్సర్‌సైజ్ బార్‌లు, గ్రౌండ్ లెవలింగ్, జంగిల్ క్లీనింగ్, ఎంఎస్ గేట్స్ ఆర్చ్‌లు ఉండాలి. పిల్లల నుంచి యువత వరకు అందరికీ ఉపయోగకరంగా తీర్చిదిద్దాలి. క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా ఎక్కడా పూర్తి స్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. ఇక పట్టణాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు సైతం ఇదే పరిస్థితిలో ఉన్నాయి. ఒక్కో క్రీడా ప్రాంగణానికి రూ.లక్షలు ఖర్చు చేసినా వృథాగా మారాయి. అధికారులు వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎంసీహెచ్‌గా మార్చేందుకు కృషి

- ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మాతాశిశు ఆస్పత్రిగా మార్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే, చెన్నూర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రాస్కానింగ్, సీటీ స్కానింగ్, సీసీ కెమెరాలు, అంబులెన్స్, ప్రింటర్లు, బెడ్‌షీట్లు లేవని ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ తెలిపారు. ఆరోగ్య శ్రీ, రెవెన్యూ బడ్జెట్ నుంచి ప్రింటర్లు, బెడ్‌షీట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూ చించారు. ఆరోగ్యశాఖ మంత్రితో మాట్లాడి అంబులెన్స్, అల్ట్రాస్కానింగ్, సీటీ స్కానింగ్ యంత్రాలు మంజూరు చేయిస్తానని చెప్పారు. ఆర్ఎంవో వనిత, వైద్యులు స్వస్తిక్ జైస్వాల్, ప్రతాప్‌గౌడ్, కీర్తి, కమిటీ సభ్యులు సాయికిరణ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మండలంలోని 40 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివేక్ అందజేశారు. అనంతరం పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల, ఎస్టీ బాలుర వసతిగృహాలను ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

కాంగ్రెస్‌లోకి మాజీ జెడ్పీటీసీ

చెన్నూర్ బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు మండలంలోని అస్నాద, ఒత్కులపల్లి, గంగారం, పొక్కురు, చాకెపల్లి, పొన్నారం, భీరెల్లి, కమ్మరిపల్లి గ్రామాలకు చెందిన 300 మంది అనుచరులతో బుధవారం ఎమ్మెల్యే వివేక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వివేక్ వారికి కాంగ్రెస్ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, నాయకులు ఫయాజ్, మైదం రవి, బషీరొద్దీన్, హిమవంతరెడ్డి, తనుగుల రవికుమార్, చెన్న సూర్యనారాయణ, గొడిసెల బాపురెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వివేక్

- చెన్నూర్‌లోని ఓ చౌరస్తాలో కుమురంభీం విగ్రహం ఏర్పాటు చేసి కుమురంభీం చౌరస్తాగా నామకరణం చేయాలని, సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని ఆదివాసీ సంఘం నాయకులు జేక శేఖర్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంఘం నాయకులు చెడెంకి మాంతయ్య, దుగ్నె జయిలు, తైనెని రవి, పెద్దల వెంకటేశ్, సందనవేని అజయ్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల సందర్శన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే వివేక్ బుధవారం సందర్శించారు. బోర్‌వెల్‌కు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కళాశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ ఎంవి.పటవర్ధన్, కాంగ్రెస్ నాయకుడు హేమంత్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

దండెపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూరిబా, బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో రోగులు, సిబ్బందితో మాట్లాడారు. డాక్టర్ విధుల్లో లేకపోవడంతో ఎందుకు రాలేదని జిల్లా వైద్యాధికారికి ఫోన్ చేసి అడిగి తెలుసుకున్నారు. ఉన్నత పాఠశాలను సందర్శించి భవనాన్ని పరిశీలించారు. పాఠశాల సముదాయంలో కళాశాల నిర్వహణతో ఇబ్బంది ఏర్పడుతుందని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో భూ వివాదంతో నిలిచిపోయిన ప్రభుత్వ కళాశాల భవనాన్ని పరిశీలించారు. మండలంలోని లింగాపూర్ గ్రామంలో నర్సరీ నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.



లింగాపూర్ పాఠశాలలో చిన్నారులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

దండేపల్లి గ్రామీణ బ్యాంకు వద్ద రైతులతో మాట్లాడారు. రుణమాఫీ కాని వారు ఉంటే అధికారులను సంప్రదించాలని సూచించారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి తహసీల్దార్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, భూ సేకరణ, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు భూముల గుర్తింపు, ధ్రువపత్రాల దరఖాస్తుల పరిశీలన, వెనుకబడిన తరగతుల వసతిగృహాల ఏర్పాటుకు భూ పరిశీలన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పట్టాపాసు పుస్తకాల మంజూరు, మ్యూటేషన్ దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. సింగరేణి, రైల్వే, నీటిపారుదల శాఖలకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియలో మార్కెట్ ధరలను నిర్ధారించి భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మంచిర్యాల, నస్పూర్, దండేపల్లి, చెన్నూర్, మందమర్రిలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వసతిగృహాల ఏర్పాటుకు భూములు గుర్తించేందుకు దరఖాస్తులు తీసుకోవాలని తెలిపారు.

రుణమాఫీపై బీఆర్ఎస్ పోరుబాట

- నియోజకవర్గ కేంద్రాల్లో నేడు ధర్నా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రైతుల పంట రుణాల మాఫీపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట పట్టింది. ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పి లుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నారు. పార్టీ అధిష్టా నం పిలుపు మేరకు జిల్లాలో ధర్నాలకు పార్టీ యంత్రాంగం సిద్ధమైంది. రైతులతో కలిసి పె ద్దయెత్తున ధర్నాలు నిర్వహించి విజయవంతం చేయాలని యోచిస్తోంది. జిల్లాలో రైతుల పంట రుణాలు చాలామందికి ఇంకా మాఫీ కా లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. కొందరికి అన్ని అర్హతలు ఉన్నా మాఫీ కాకపోవడంతో అ భ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం చిన్న చిన్న తప్పిదాలతోనే మాఫీకి దూరమయ్యామని రుణగ్రహీతల నుంచి అధి కారులకు అర్జీలు వస్తున్నాయి. జిల్లాలో తుది విడత మాఫీ ప్రకటించినప్పటి నుంచే అర్హత ఉండి మాఫీ కాని రైతులను గుర్తించి అధికారులు మళ్లీ పరిశీలన చేస్తున్నారు. కొన్ని చోట్ల తమకు మాఫీ కావడం లేదని రైతులు ధర్నాలు చేపడుతున్నారు. బ్యాంకుల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆ ర్ఎస్ పార్టీ నిరసనలకు పిలుపునిచ్చి రైతుల మద్దతు పొందేందుకు ప్రణాళిక రూపొందించింది. ఈ క్రమంలో భారీయెత్తున బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు నిరసన కార్యక్రమానికి తరలి రావాలని పార్టీ నాయకత్వం పిలుపునిచ్చింది. దీంతో జిల్లాలో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

మహిళా శక్తితో ఆర్థిక భరోసా

- వలు రకాల వ్యాపారాలకు కార్యాచరణ
- జిల్లాలో 8,471 యూనిట్లకు ప్రతిపాదనలు

దండేపల్లి: మహిళా సంఘాల సభ్యులు వ్యాపారాలతో ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పేరుతో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు ఇప్పటికే అందిస్తుండగా.. మహిళా శక్తి పథకం మహిళలకు మరింత చేదోడుగా నిలువనుంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహికులను గుర్తించి బ్యాంకు రుణాల సాయంతో వ్యాపారాలు ప్రారంభించేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వ్యాపారాలకు సంబంధించిన యూనిట్లకు ప్రతిపాదనలు పంపించారు. జిల్లాలో రూ.81.05 కోట్ల అంచనాతో 8,471 యూనిట్లకు ప్రతిపాదనలు పంపినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ తెలిపారు.



దండేపల్లిలో సమావేశమైన మహిళలు

యూనిట్ల వివరాలు

మైక్రో ఎంటర్ ప్రైజెస్‌లు 5684, కుట్టు కేంద్రాలు 42, మీసేవా కేంద్రాలు 20, ఈవెంట్ మేనేజ్‌మెంట్ 1, మహిళా క్యాంటీన్లు 5, ప్లాస్టిక్ మేనేజ్‌మెంట్ 1, మిల్క్ ఎనిమల్స్ 500, బ్యాక్‌యార్డు పౌల్ట్రీ 2000, పౌల్ట్రీ మదర్‌యూనిట్స్ 16, ఫుడ్ ప్రాసెసింగ్‌యూనిట్స్ 200, మొబైల్ ఫిషింగ్ 1, మిల్క్ పార్లర్ 1 ఉన్నాయి.

విద్యార్థుల హాజరు శాతం మెరుగుపర్చాలి

కాసిపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపర్చేలా ఉపాధ్యాయుడు పూర్తి స్థాయిలో కృషి చేయాలని డీఈవో యాదయ్య సూచించారు. మండలంలోని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను బుధవారం డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ తరగతులు, పదో తరగతి విద్యార్థుల అభ్యాసన స్థాయి పరిశీలించారు. పాఠశాలలో 53 మంది విద్యార్థులకు గాను 35 మంది హాజరు కావడంతో హాజరు శాతం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు పెంచాలి

బెల్లంపల్లి: ఉపాధ్యాయులకు ఇచ్చిన శిక్షణ విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలు పెంచడానికి ఎంతగానో దోహదపడుతుందని డీఈఓ ఎస్.యాదయ్య అన్నారు. బెల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జీవననైపుణ్యాలపై నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఎంపిక చేసిన 30 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కే.సత్యనారాయణ, పైడాకుల రాజన్న, లయన్స్‌క్లబ్ జిల్లా రెండో ఉప గవర్నర్ బద్రేశం, జోన్ చైర్మన్ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ యాదయ్య

టైగర్‌జోన్‌లో తగ్గని వేగం

- అమలు కాని 30కిలోమీటర్ల నిబంధన
- చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- అధికారులు అవగాహన కల్పించినా ఫలితం శూన్యం

జన్నారం: టైగర్‌జోన్‌లో వాహనాలు దూసుకెళ్తున్నాయి. వాహనాల వేగం గంటకు 30కిలోమీటర్లకు మించరాదనే నిబంధనలు ఉన్నా వాహనదారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అడవి నుంచి బయటకు వచ్చిన వన్యప్రాణులు ప్రమాదం బారిన పడుతున్నాయి. కొన్ని సమయాల్లో వన్యప్రాణుల వల్ల వాహనదారులూ ప్రమాదం బారిన పడిన గాయపడుతున్నారు. వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో వేగం పెంచడంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోయి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. ఈ క్రమంలో టైగర్‌జోన్‌లో వేగం నియంత్రించేందుకు అధికారులు నాకాబందీ పేరిట తనిఖీలు చేస్తూ వాహదారులకు అవగాహన కల్పిస్తున్నారు.

నిబంధనలు బేఖాతార్

దట్టమైన అడవులు, వన్యప్రాణుల సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా 2012లో కవ్వాల్ అభయారణ్యాన్ని కేంద్ర ప్రభుత్వం టైగర్‌జోన్‌గా ప్రకటించింది. అప్పటి నుంచి ఒక్కో నిబంధన అమలు చేస్తున్నారు. రాత్రివేళల్లో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. భారీ వాహనాలకు అనుమతి నిరాకరించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. టైగర్‌జోన్‌లో సుమారు 60కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇరువైపుల అడవులు ఉండడం వల్ల వన్యప్రాణులు రోడ్డు దాటే అవకాశం ఉంది. దీంతో అధికారులు టైగర్‌జోన్ పరిధిలో వాహనదారులు గంటకు 30కిలోమీటర్ల వేగం దాటవద్దనే నిబంధన అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రధాన రహదారికి ఇరువైపుల తపాలాపూర్ నుంచి కడెం వరకు, ఉట్నూర్ వరకు అటవీ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాహనదారులు పట్టించుకోకుండా అతివేగంగా వెళ్తుండడంతో వన్యప్రాణులు వాహనాలకు తగిలి మృత్యువాత పడుతున్నాయి. జన్నారం నుంచి తపాలాపూర్ చెక్‌పోస్టు మధ్యలో అనేక ప్రమాదాలు జరిగాయి.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు(ఫైల్)

వాహనదారులకు అవగాహన

టైగర్‌జోన్ ప్రాంతంలో వాహనాల వేగానికి బ్రేక్ వేసేందుకు నూతన పద్ధతిని అవలంబిస్తున్నారు. తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి అటవీ రేంజ్‌ల ప్రాంతంలో అటవీ అధికారులు జట్టుగా తనిఖీలు చేస్తూ వేగనియంత్రణపై అవగాహన కల్పిస్తున్నారు. వేగానికి సంబంధించిన బోర్డులను డ్రైవర్‌కు ఇస్తూ పాటించాలని సూచిస్తున్నారు. వేగంగా వాహనాలు నడపడం వల్ల వన్యప్రాణులు తగిలి ప్రమాదాలు జరిగితే గాయాల పాలయ్యే అవకాశం ఉందని, ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని వివరిస్తున్నారు. వన్యప్రాణి చనిపోతే కేసులు అవుతాయని, వాహనదారులకు ఏదైనా జరిగితే కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందంటున్నారు.



అడవిలో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

అవగాహన కల్పిస్తున్నాం



టైగర్‌జోన్ ప్రాంతంలో వేగం తగ్గించాలని సూచిక బోర్డులు ఏర్పాటు చేశాం. వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. కాని కొందరిలో మార్పు రావడం లేదు. వన్యప్రాణులు ఒకేసారి బయటకు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రోడ్డుకు ఇరువైపుల వ్యూలైన్స్ ఏర్పాటు చేశాం. వేగం 30 కిలోమీటర్లలోపే వెళ్లాలని సూచిస్తున్నాం. ప్లాస్టిక్ కవర్లు అడవి ప్రాంతంలో పడేయవద్దు. ఈ విషయాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్‌రేంజ్ అధికారి

కొన్ని ఘటనలు

రాత్రిపూట వన్యప్రాణులు రోడ్డు దాటే క్రమంలో అతివేగంగా వెళ్లే ప్రమాదాలు సంభవిస్తాయి. అడవిపందులు, దుప్పులు, నీలుగాయిలు అతివేగంగా రోడ్డు దాటే అవకాశం ఉంది. జన్నారం మండలంతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు గాయపడ్డారు.

- రెండేళ్ల క్రితం జింకల పార్కు సమీపంలో అడవిపంది అడ్డు రావడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఐదుగురు గాయపడ్డారు.
- మహ్మదాబాద్ గ్రామ సమీపంలో అడవి పంది రోడ్డు దాటే క్రమంలో ఆటోకు తగలడంతో బోల్తాపడింది. నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు.
- జన్నారానికి చెందిన బీజేపీ మాజీ అధ్యక్షుడు గోలి చందు మోటార్‌సైకిల్‌పై వస్తుండగా ఒక్కసారిగా వన్యప్రాణి అడ్డు రావడంతో తప్పించబోయి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు.
- రాత్రివేళ పెట్రోలింగ్‌కు వెళ్లిన పలువురు అటవీ అధికారులు కూడా వన్యప్రాణులు తగిలి గాయాలపాలయ్యారు.
- తపాలాపూర్ గ్రామ సమీపంలో మంచిర్యాలకు చెందిన భార్యాభర్తలు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వన్యప్రాణి అడ్డు రావడంతో తప్పించబోయి కల్వర్టును ఢీకొట్టి కిందపడ్డారు. ఈ ఘటనలో భార్య మృతిచెందింది. ఇలా అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి.

క్లుప్తంగా

తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను అప్పగిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

లక్సెట్టిపేట: రాపల్లి గ్రామానికి చెందిన జాస్మిని (10) తప్పిపోయి ఆర్టీసీ బస్సు ఎక్కడంతో స్థానిక బ్లూకోల్ట్స్ సిబ్బంది కుటుంబీకులకు అప్పగించారు. వివరాలు.. జాస్మిని రాపల్లి స్టేజీ వద్ద ఆడుకుంటుండగా వారి కుటుంబీకులు ఆర్టీసీ బస్సు ఎక్కుతున్నట్లు గమనించి వారి వెంటే ఎక్కింది. బస్సు లక్సెట్టిపేటకు వస్తుండగా కొద్ది దూరం వెళ్లిన తర్వాత కండక్టర్ గమనించి 'డయల్ 100'కు ఫోన్ చేసి స్థానిక బస్టాండ్‌లో బ్లూకోల్ట్స్ సిబ్బంది రాజు, సత్యంకు బాలికను అప్పగించారు. వారు.. బాలిక ఎక్కడ బస్సు ఎక్కింది.. అని ఆరా తీసి వారి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. తండ్రి సత్తయ్యను పిలిపించి బాలికను అప్పగించారు. దీంతో పోలీసులను స్థానికులు అభినందించారు.

కలప పట్టివేత



అటవీ అధికారులు పట్టుకున్న కలప

జన్నారం: జన్నారం అటవీ డివిజన్ జన్నారం రేంజ్ పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను బుధవారం ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుష్మారావుకు వచ్చిన సమాచారం ప్రకారం సిబ్బందిని అప్రమత్తం చేశారు. డీఆర్వో తిరుపతి సిబ్బందితో కలిసి కిష్టాపూర్ గ్రామానికి చెందిన గాజుల మల్లేశ్ ఇంటిలో తనిఖీలు చేయగా 11 టేకు చెక్కలు, 4 టేకు దిమ్మెలు లభించాయి. వాటిని టింబర్ డిపోకు తరలించినట్లు డీఆర్వో తెలిపారు. కలప విలువ రూ.15,150 ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు డీఆర్వో పేర్కొన్నారు.

మద్యం మత్తులో బలవన్మరణం



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సాంబారి పోచయ్య (58) మద్యం మత్తులో బలవన్మరణానికి పాల్పడ్డాడు. హాజీపూర్ ఎస్సై సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాంబారి పోచయ్య కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 19వ తేదీన మద్యం మత్తులో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకోగా గమనించిన కుటుంబ సభ్యులు పోచయ్యను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 20వ తేదీ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య పోసక్కతోపాటు కుమారుడు హరీశ్, కూతురు సరోజన ఉండగా వీరికి వివాహాలయ్యాయి. మృతుడి కుమారుడు హరీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆరోగ్యమిత్రలపై పట్టింపేది?

- 17 ఏళ్లయినా 'పొరుగు' సేవల్లోనే..
- చాలీచాలని జీతాలతో సతమతం
- గోడు పట్టించుకోని ప్రభుత్వాలు
- ఈనెల 23 నుంచి సమ్మెబాటలో..



నర్సాపూర్ సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్ర

నిర్మల్‌చైన్‌గేట్: రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవల్లో కీలకపాత్ర పోషిస్తున్న ఆరోగ్యమిత్రల పరిస్థితి దయనీయంగా మారింది. 17 సంవత్సరాలుగా రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నా ప్రభుత్వాలు వీరిని పట్టించుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే పలుసార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అయినా స్పందనలేకపోవడంతో ఈనెల 23వ తేదీ నుంచి సమ్మెకు సిద్ధమవుతున్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో, సచివాలయ ఉన్నతాధికారులకు ఇప్పటికే సమ్మె నోటీసు అందజేశారు.

ఉమ్మడి జిల్లాలో 76 మంది..

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 76 మంది ఆరోగ్యమిత్రలు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 22 మంది, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 19, నిర్మల్‌లో 19, మంచిర్యాల జిల్లాలో 16 మంది ఉన్నారు. వీరంతా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. ఆస్పత్రిలో రోగి చేరిన నుంచి డిశ్చార్జి అయ్యేదాకా వైద్యసేవల విషయంలో ఆరోగ్యమిత్రలే కీలకంగా వ్యవహరిస్తారు. వీరు సమ్మెకు దిగితే రోగులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.

కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో..

2007లో ఆరోగ్యశ్రీ స్కీంను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 900 మంది ఆరోగ్యమిత్రలను నియమించింది. ఉమ్మడి జిల్లాలో 76 మంది వరకు పనిచేస్తున్నారు. అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వీరికి నెలకు రూ.18వేల వేతనం ఇస్తున్నారు. వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని అప్పటి నుంచి ప్రభుత్వాలను కోరుతున్నారు. గతంలో వేతనాలు పెంచుతామని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ యాజమాన్యం హామీ ఇచ్చినా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సానుకూలమైన స్పందన రాలేదు. దీంతో చాలీచాలని వేతనాలతోనే పనిచేస్తూ దుర్భర జీవితాలను అనుభవిస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోయినా కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సమస్యలు తీరుతాయని ఆరోగ్యమిత్రలు భావిస్తున్నారు. అందులో భాగంగా రాష్ట్ర నాయకులు గత డిసెంబర్ 8వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనరసింహ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ సీఈవోను కూడా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. అయినా ఇప్పటివరకు వీరి సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు.

డిమాండ్లు ఇవే..

- ఆరోగ్యమిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలి. జీవో నంబర్ 60 ప్రకారం రూ.22,750 వేతనం చెల్లించాలి.
- వేతనాలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలి.
- రాబోయే పీఆర్సీలో కనీస వేతనం రూ.35వేలతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలి.
- షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలి.
- 17 ఏళ్ల నుంచి పీహెచ్‌సీల్లో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను తిరిగి వాటిలోనే నియమించాలి. ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలి.
- విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డ్ సౌకర్యం కల్పించాలి.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి



నేను 17 సంవత్సరాల నుంచి ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న. మమ్మల్ని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ.22,750కు పెంచాలి. మా వేతనాలను నేరుగా ట్రస్టు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అవుట్ సోర్సింగ్ సిబ్బందిగా కాకుండా కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగులుగానైనా గుర్తించాలి.

– కౌటిక శ్రీనివాస్, ఆరోగ్యమిత్ర, నిర్మల్ జనరల్ ఆస్పత్రి

పదహారేళ్లుగా పనిచేస్తున్నాం



రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో సుమారు 17 సంవత్సరాలుగా పని చేస్తున్నాం. చాలీచాలని వేతనాలు, ఉద్యోగభద్రత లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మా సమస్యలు పరిష్కరించాలని గతంలో అనేక సార్లు ఉన్నతాధికారులకు విన్నవించినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదు.

– సంగీత, ఆరోగ్యమిత్ర, భైంసా ఏరియాస్పత్రి

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత



మొక్క నాటుతున్న జీఎం, అధికారులు

రామకృష్ణాపూర్: మొక్కలు నాటడం సామాజిక బాధ్యత అని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ పేర్కొన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఏరియాలోని రామకృష్ణాపూర్ ఓపెన్‌కాస్ట్ ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం అధికసంఖ్యలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. భవిష్యత్ తరానికి వనసంపదను అందించాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు యాజమాన్యం వనమహోత్సవానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, మేనేజర్ సుధీర్ జయవంత్‌రావు, సీఎంవోఏఐ ఏరియా అధ్యక్షుడు ఎస్.రమేశ్, ఏఐటీయూసీ నాయకులు అక్బర్‌అలీ, సలెంద్ర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లాభాలు ప్రకటించాలి

శ్రీరాంపూర్: 2023–24లో సాధించిన వార్షిక లాభాలను వెంటనే ప్రకటించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మార్చి 31, 2024 వార్షిక సంవత్సరం ముగిసిందని, మరుసటి రోజే వార్షికోత్పత్తిని ప్రకటించిన అధికారులు ఎంత లాభాలు వచ్చాయో మాత్రం ప్రకటించలేదని పేర్కొన్నారు. వెంటనే లాభాలు ప్రకటించి అందులో నుంచి 35శాతం వాటా కార్మికులకు పంచాలని డిమాండ్ చేశారు. జాప్యం చేస్తే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సెక్స్ రాకెట్ గుట్టు రట్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

- నగరం నడి బొడ్డున దందా
- ఏడుగురు విటుల అరెస్ట్

మంచిర్యాలక్రైం: మంచిర్యాల పట్టణ నడిబొడ్డున.. చుట్టూ ఉన్నత వర్గాలకు చెందిన నివాస గృహాలు.. ప్రముఖ ఆస్పత్రి.. దేశంలో అత్యున్నత పేరున్న ఇన్సూరెన్స్ కార్యాలయం.. పక్కనే బార్ అండ్ రెస్టారెంట్.. నిత్యం జనసందడితో ఉండే ప్రాంతంలో ఓ ఇంటిని గెస్ట్‌హౌస్‌గా మార్చుకుని రాత్రీపగలు తేడా లేకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నముఠాను మంచిర్యాల పోలీసులు పట్టుకున్నారు. సంబంధిత వివరాలను స్థానిక ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఏసీపీ ఆర్ ప్రకాశ్ విలేకరులకు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని ఎల్ఐసీ కార్యాలయ సమీపంలోని ఓ ఇంటిని ప్రైవేట్ గెస్ట్ హౌస్‌గా మార్చుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు స్థానిక సీఐ బన్సీలాల్ సిబ్బందితో మంగళవారం ఆకస్మిక దాడి చేశారు. గెస్ట్‌హౌస్‌లో కరీంనగర్‌కు చెందిన ఓ మహిళ, ఆమెతో పాటు మరో ఏడుగురు వ్యక్తులు కలిసి ఉండగా అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో స్థానిక చున్నం బట్టివాడకు చెందిన కరుణాకర్ అనే వ్యక్తి సదరు ఇంటిని అద్దెకు తీసుకుని ప్రైవేట్ గెస్ట్‌హౌస్‌గా మార్చుకుని ఈవెంట్స్ పేరిట దందాకు తెరలేపాడు. గెస్ట్ హౌస్ మేనేజర్ బాధ్యతలు బెల్లంపల్లికి చెందిన శాతాని శంకర్‌కు అప్పగించాడు. కరుణాకర్, శంకర్ ఈవెంట్స్ కార్యక్రమాలు, షూట్స్ చేసేవారు. శంకర్‌కు గతంలో ఇతర లాడ్జీల్లో మేనేజర్‌గా పని చేసిన అనుభవం ఉంది.

ఒక్కో విటుడి నుంచి రూ.2వేలు

శంకర్ అందమైన అమ్మాయిల ఫొటోలు వాట్సాప్ ద్వారా షేర్ చేసి విటులను గెస్ట్‌హౌస్‌కు పిలిపించేవాడు. బాధిత మహిళలకు రూ.వెయ్యి, శంకర్ రూ.వెయ్యి తీసుకుని దందా నడుపుతున్నాడు. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ మహిళకు షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశం ఇప్పిస్తానని, డబ్బులు ఎక్కువ వస్తాయని మభ్యపెట్టి మంచిర్యాలకు పిలిపించాడు. బాధిత మహిళ ఫొటోలు మంచిర్యాల, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్, సీసీసీ నస్పూర్, మందమర్రి, శ్రీరాంపూర్‌కు చెందిన వారికి వాట్సాప్ ద్వారా పంపించాడు. మహిళ ఫొటోలు చూసిన బెల్లంపల్లికి చెందిన కొప్పర్తి నవీన్, దేవ పోషమల్లు, రామకృష్ణాపూర్‌కు చెందిన గండి రమేశ్, స్థానిక హమాలీవాడకు చెందిన కొలిపాక రాజశేఖర్, సీసీసీ నస్పూర్‌కు చెందిన గొల్లపల్లి శేఖర్, మోయిన్ మంగళవారం రాత్రి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఒక్కొక్కరు రూ.2వేల చొప్పున మొత్తం రూ.12వేలు శంకర్‌కు ముట్టజెప్పారు.

షార్ట్‌ఫిలిమ్స్‌లో అవకాశాల పేరిట మోసం

నవీన్, పోషమల్లు, రమేశ్, రాజశేఖర్, శేఖర్, మోయిన్ షార్ట్‌ఫిలిమ్స్ తీస్తారని సదరు మహిళకు శంకర్ పరిచయం చేయించాడు. వారికి సహకరిస్తే మంచి అవకాశాలతో పాటు డబ్బులు కూడా ఎక్కువే ఇస్తారని ఘాయమాటలు చెప్పాడు. దీంతో బాధిత మహిళ ఆర్థిక పరిస్థితి బాగా లేనందున ఒప్పుకొంది. దీంతో ఈ ఆరుగురు గెస్ట్‌హౌస్‌కు చేరుకోగా ముందస్తు సమాచారం మేరకు రైడ్ చేసి ఆరుగురు విటులతోపాటు శంకర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇంటిని అద్దెకు తీసుకున్న కరుణాకర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ.15వేలు నగదు, ఏడు ఫోన్లు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందిన వెంటనే చాకచక్యంగా వ్యవహరించిన స్థానిక సీఐ బన్సీలాల్, ఎస్సై సురేశ్, సిబ్బందిని సీపీ శ్రీనివాసులు, డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్ అభినందించారు.

సౌకర్యాల కల్పనలో విఫలం



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్: గనులపై కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో యాజమాన్యం విఫలమైందని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు. బుధవారం ఆర్కే–5గనిని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు తెలుసుకుని మాట్లాడారు. రెస్ట్ హాల్స్ వర్షం పడితే ఉరుస్తున్నాయని, చెత్తాచెదారంతో అధ్వానంగా మారాయని తెలిపారు. నాసిరకం బూట్లు, డ్రిల్‌బిట్లు సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. గని లోపల వెంటిలేషన్ సమస్య అధికంగా ఉందని, దీంతో కార్మికులు అస్వస్థతకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి తగిన చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, పిట్ సహాయ కార్యదర్శి లక్కిరెడ్డి సత్తిరెడ్డి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, ట్రేడ్స్‌మెన్ నాయకులు సురేశ్, మల్లేశ్, జీపీ రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్యాంటీన్లను మెరుగుపరచాలి



కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్: అన్ని గనులపై క్యాంటీన్లను మెరుగుపరిచి పౌష్టికాహారాన్ని అందించాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎస్ఆర్పీ–3 గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. యాజమాన్యం కార్మికుల కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమవుతోందని ఆరోపించారు. అధికారులు ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల ఆరోగ్యం, సంక్షేమంపై చూపడంలేదని విమర్శించారు. గనులపై రెస్ట్‌హాల్స్ శుభ్రంగా ఉంచడం లేదని, నిర్వహణ అధ్వానంగా ఉందని తెలిపారు. కార్మికులు దుస్తులు, ఇతర వస్తువులను భద్రపరుచుకునేందుకు లాకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, కేంద్ర కమిటీ నాయకుడు తిరుపతి రాజు, బ్రాంచ్ నాయకులు నీలం సదయ్య, మహేందర్‌రెడ్డి, భూపతి అశోక్, రావుల అనిల్, గోపాల్‌రెడ్డి, వీరమల్లు, పిట్ సెక్రటరీ పెట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

చెన్నూర్: గంజాయి తరలిస్తున్న ఐదుగురిని పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామ శివారు ప్రాంతంలో పోలీసులు బుధవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా వెళ్తున్న జనగామ రజినీకాంత్, సయ్యద్ అజ్జు, దాసరి అరుణ్, జాడి సాయిపవన్, ఎండీ తౌఫిక్‌ను పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా 90 గ్రాముల గంజాయి లభించింది. వీరిని వెంటనే అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంట ఎస్సై సుబ్బారావు ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవీందర్

కౌటాల: మండలంలోని తలోడి గ్రామపంచాయతీ పరిధి ధనుర్‌హెట్టి గ్రామానికి చెందిన మద్దెల సతీశ్ బుధవారం గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు కౌటాల సీఐ రమేశ్ తెలిపారు. అతడి నుంచి రూ.5వేల విలువైన 160 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అతడిపై కేసు నమోదు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్సై మధుకర్ ఉన్నారు.

20 రోజుల్లో రెండు ఈతలు

- గేదెకు రెండు దూడలు జననం



రెండు లేగదూడలకు జన్మనిచ్చిన గేదెతో రైతు

నెన్నెల: మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన రైతు పల్ల చిన్నన్నకు చెందిన గేదె 20 రోజుల వ్యవధిలో రెండు ఈతలు ఈనింది. ఒక మగ గూడ, ఒక ఆడదూడకు జన్మనిచ్చి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 20 రోజులు క్రితం మగ దూడను ఈనిన గేదె అప్పటి నుంచి పాలు ఇవ్వడం లేదు. తాజాగా బుధవారం మరో ఆడదూడను ఈనింది. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని రైతు ఆనందం వ్యక్తం చేశాడు. నెన్నెల పశువైద్యాధికారి చందన్‌ను సంప్రదించగా.. జన్యుపరమైన కారణాలతో లక్షల్లో ఒక గేదెకు ఇలా రెండు లేగదూడలు కొన్ని రోజుల వ్యవధిలో పుడుతుంటాయని తెలిపారు.

బాస్కెట్ బాల్ బాలబాలికల జట్టు ఎంపిక

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా బాస్కెట్ బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు ముగిశాయి. అండర్–14, 17 క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫణిరాజా ప్రకటించారు. అండర్–17 బాలికల విభాగంలో తేజస్విని, రమ్య, ఆరతి, వైశాలి, శ్రీవల్లి, అక్షిత, రోషిణి, క్రిష్ణకా, అక్షయ, ముస్కాన్, ఆర్. అంజలి, పి.అంజలి, అయేషా ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో అమన్, రాహుల్, ప్రేమ్, ఆశిష్, సిద్ధార్థ్, హరీశ్, ఆర్.ఎస్.కుమార్, చార్లెస్, శ్రీచరణ్, రోహన్‌రావ్, అఖిల్ ఎంపికయ్యారు. అండర్–14 బాలికల విభాగంలో హిమశ్రీ, రితిక, సాత్విక, జెశ్విత, సాయిశృతి, నైతిక, నజియా, చైత్ర, అక్షిత, అభిశ్రీ, వర్ష ఎంపికయ్యారు. అండర్– 14 బాలుర విభాగంలో హర్షిత్, రోహన్, శ్రీశాంత్, అభివవ్, విశాల్, సాయిదీక్షిత్, శ్రేయస్‌కుమార్, అర్జున్‌రెడ్డి, షణ్ముఖసాయి, వర్షిత్‌కుమార్, అభినవ్, వెంకట్ ఎంపికయ్యారు. సెప్టెంబర్‌లో జరిగే జోనల్‌స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు.

క్రీడా షెడ్యూల్ ప్రకటించాలి

శ్రీరాంపూర్: కంపెనీలో క్రీడా షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డి ప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, నాయకుడు కొమురయ్య బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో క్రీడా షెడ్యూల్ విడుదలైందని తెలిపారు. దీనికి అనుగుణంగా 2024–25 వార్షిక క్రీడల నిర్వహణకు సంబంధించి సింగరేణిలో షెడ్యూల్ ఇప్పటికీ యాజమాన్యం ప్రకటించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా జాప్యం చేయకుండా క్రీడాభివృద్ధి దృష్ట్యా వెంటనే షెడ్యూల్ ప్రకటించాలని, క్రీడాకారులకు యూనిఫామ్స్, మెటీరియల్, క్రీడా సామగ్రిని సత్వరమే కొనుగోలు చేసి అందించాలని డిమాండ్ చేశారు.

దాడి కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుర్జాపూర్ నుంచి తాండూర్‌కు వెళ్తున్న ఇద్దరిపై ట్రాక్టర్‌తో దాడికి పాల్పడిన ఘటనలో ఒకరికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై గంగారాం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుర్జాపూర్ గ్రామం నుంచి దాసరి శ్రీనివాస్, దాసరి రాజన్న మోటారుసైకిల్‌పై వెళ్తుండగా పూదరి చంద్రశేఖర్ ట్రాక్టర్‌తో ఎక్కించి దాడికి పాల్పడ్డాడు. అనంతరం గొడ్డలితో నరికి చంపుతానని బెదిరించాడు. దాసరి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై సురేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బుధవారం పూర్తి సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో మంచిర్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారన్‌రెడ్డి నిందితుడు పూదరి చంద్రశేఖర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

నీలుగాయి మాంసం విక్రయిస్తున్న వారి అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ రేంజ్ పరిధిలోని చింతలపల్లి గ్రామ సమీపంలోగల వేర్‌బ్రిడ్జి వద్ద బుధవారం నీలుగాయి మాంసం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అటవీ అధికారులు దాడులు నిర్వహించారు. నీలుగాయి మాంసంతో పాటు విక్రయిస్తున్న చింతలపల్లికి చెందిన నైతం జనార్దన్, నైతం సంపత్, చాకటి లస్మయ్యను అదుపులోకి తీసుకున్నట్లు చెన్నూర్ అటవీ రేంజ్ అధికారి అప్పలకొండ తెలిపారు. బుద్ధారం గ్రామానికి చెందిన కడల ప్రవీణ్, అర్ష బానేశ్ అటవీ ప్రాంతంలో వేట కుక్కలతో నీలుగాయిని వేటాడి చంపినట్లు రుజువు కాగా వీరినీ అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. అటవీ జంతువును వేటాడి, దాని మాంసాన్ని విక్రయించిన ఐదుగురిని చెన్నూర్ కోర్టులో హాజరుపరచగా వీరికి జడ్జి 14రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. దాడిలో డిప్యూటి రేంజర్ ప్రభాకర్, సెక్షన్ అధికారి రాజేశ్, బీట్ అధికారులు జ్యోతి, స్వప్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 కాలనీలో బుధవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. కాలనీలోని ఎస్పీ–77లో నవీన్ అనే సింగరేణి ఉద్యోగి కుటుంబం నివాసముంటోంది. నవీన్ బుధవారం ఉదయం షిఫ్ట్ విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం అతడి భార్య రమాదేవి స్కూల్‌లో కూతురికి లంచ్‌బాక్స్ తీసుకెళ్లింది. ఎవరూ లేని సమయం చూసి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి దూరారు. బీరువా తెరిచి అందులోని సుమారు 20 తులాల వెండి, 10 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. కూతురుకు లంచ్ తినిపించి వచ్చిన రమాదేవి ఇంట్లోకి వెళ్లి చూసి అవాక్కయింది. వెంటనే భర్తకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

మందమర్రిరూరల్: మందమర్రి కేకే ఓసీలో ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రతీ నెల 7లోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. ఏరియా జీఎం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం, కాంట్రాక్టర్ విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు.